క్లుప్తంగా

నేడు రూరల్ తహసీల్దారు కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దారు కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ పి.జాహ్నవి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు తెలియజేయవచ్చునని ఆమె తెలియజేశారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు



పెనమలూరు: యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని సీఐ ఎం.కిషోర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ యోగా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో యోగాశక్తి శిబిరాన్ని సీఐ కిషోర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయటం వలన మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. పోలీసులు ఆరోగ్యవంతంగా ఉండటానికి యోగా సాధన ఎంతగానో మేలు చేస్తుందన్నారు. యోగాశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగా శక్తితో నాడులు చైతన్యం పొంది ప్రాణశక్తి పెంపొందించి ఆయుషు పెరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొని యోగాశక్తి చికిత్స చేయించుకున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలబాలికలకు ఫెన్సింగ్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ పోటీలను జరిపారు. అనంతరం విజేతలకు ప్రజ్ఞ స్కూల్ డైరెక్టర్ పవన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, దేవరపల్లి విక్టర్‌బాబు, శిక్షకులు దనియాల నాగరాజు, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవుని ప్రేమలో జీవించండి

గుణదల (విజయవాడ తూర్పు): సన్మార్గంలో నడుచుకునే భక్తులు దేవుని ప్రేమలో జీవిస్తారని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమష్టి దివ్యబలిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలో దేవుడు ఆజ్ఞాపించిన నిబంధనల ప్రకారం నడుచుకోవాలని వివరించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. విశ్వాసులు కొండపై కొలువు దీరిన మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. శిఖరాగ్రాన ఉన్న ఏసుక్రీస్తు సిలువ వరకు కాలినడకన చేరుకున్నారు.

20న సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఈ నెల 20వ తేదీన ప్రారంభించనున్నట్లు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన మూడవ సచివాలయం భవనాన్ని, ఒకటవ సచివాలయ పరిధిలో రూ.23.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తారని పీఆర్ ఏఈ ఎస్.శివరామకృష్ణ తెలియజేశారు.

సబ్‌వేల నిర్మాణంతో ప్రమాదాల నివారణ

పెనమలూరు: బందరు రోడ్డు పై ట్రాఫిక్ విపరీతంగా పెరగటంతో ప్రమాదాల నివారణకు సబ్‌వేలు తప్పనిసరిగా అవసరం ఏర్పడింది. సిద్ధార్థ కాలేజీ, తాడిగడప జంక్షన్, పోరంకి సెంటర్, పెనమలూరు సెంటర్ ప్రాంతాల్లో సబ్‌వేల అవసరం ఎంతైనా ఉంది. సబ్‌వేలు నిర్మిస్తే జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాలు నివారించటానికి అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు. అదే విధంగా సర్వీస్ రోడ్లు ఆవశ్యకత కూడా ఉంది. నేషనల్ హైవే శాఖ అధికారులు జాతీయ రహదారి పై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు పై మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫుట్ బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారాయి. పది సంవత్సరాల క్రితం విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం చేశారు. అయితే మండల పరిధిలో ఉన్న జనాభాను దృష్టిలో ఉంచుకోకుండా అశాస్త్రీయంగా రహదారి నిర్మాణం చేయటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి బందరు రోడ్డుకు ఇరుపక్కలా చాలా గ్రామాలు ఉండటంతో ప్రజల రాకపోకలు కూడా విపరీతంగా సాగుతున్నాయి. జాతీయ రహదారికి అండర్ పాస్‌లు కాని, సబ్‌వేల నిర్మాణం కానీ చేయలేదు. ప్రజలు బందరురోడ్డు దాటడానికి కేవలం కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, పెనమలూరు సెంటర్, గోసాల ఈడుపుగల్లు క్రాస్ వద్ద మాత్రమే ఫుట్ బ్రిడ్జిలు నిర్మాణం చేశారు. మిగతా ప్రాంతాల్లో ప్రజలు నేరుగా నడుచుకుంటూ బందరు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మూడు ఫుట్ బ్రిడ్జిలు పూర్తి నిరుపయోగంగా మారాయి. ప్రజలు అసలు ఈ వంతెనలను ఉపయోగించటంలేదు. వంతెన ఎత్తుగా ఉండటంతో ఎవ్వరు వంతెన మీదగా రోడ్డు దాటడానికి ఆసక్తి చూపటం లేదు. ప్రమాదం అని తెలిసినా నడుచుకుంటూ నేరుగా జాతీయ రహదారి దాటుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన వంతెనలు ఎందుకూ పనికి రాకుండాపోయాయి. రాత్రి సమయాల్లో వంతెన పైన కూర్చుని మద్యం సేవిస్తున్నారు. కనీసం లైట్లు కూడా లేక పోవటంతో ఎవ్వరు వంతెన పై నుంచి ప్రయాణం చేయటానికి సాహసించటంలేదు. ఫుట్‌బ్రిడ్జిలకు అడ్డుగా కట్టిన ఫ్లెక్సీలు అధికారులు వెంటనే తొలగించాల్సిన అవసరం ఉంది.



భయానకంగా ఉన్న ఫుట్‌బ్రిడ్జి వంతెన మెట్లు

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో, సంతోషంగా ఉండాలని కోరుతూ అమ్మవారి సంబరం నిర్వహించామని దుర్గగుడి కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. బ్రాహ్మణ వీధిలో దేవస్థాన పరిపాలన భవనం ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద దేవతా మూర్తులకు చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూలు, పండ్లు, పూజా సామగ్రి, పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసులు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, తొత్తడి వేదకుమారి, ఉదయలక్ష్మి పాల్గొన్నారు.



అమ్మవారికి పూజా సామగ్రిని తీసుకెళ్తున్న దుర్గగుడి కమిటీ చైర్మన్ రాంబాబు

'వయోవృద్ధ' సేవలు నిరుపమానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జి.ఈశ్వర్ అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు నిండి, ఎవరూ పట్టించుకోని వయోవృద్ధులను గుర్తించి గత 192 నెలలుగా వారికి నిత్యావసర సరుకులు అందజేయడం, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. వయోవృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. జైన్స్ అందిస్తున్న సేవలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని చెప్పారు. ఇంత మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్‌సంఘం సెక్రటరీ పన్నాలాల్ డీ జైన్ వవయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి ట్రస్ట్ ద్వారా అందజేస్తున్న సేవలు వివరించారు. అనంతరం దాత మహేంద్ర హోజరీ సెంటర్ సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు కార్యక్రమంలో మోడ్రన్ కేఫ్ అధినేత మురళీధర్, ట్రస్టీలు తట్టి అర్జునరావు, ఎస్వీయూ సతీష్‌కుమార్, కె. మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహరావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.



వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ ఈశ్వర్, ట్రస్ట్ సభ్యులు, దాతలు

అమర గాయకులకు స్వరనీరాజనం

విజయవాడ కల్చరల్: సునీల్ ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకులకు స్వరనీరాజనం, ఫాదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం ఆలపించిన గీతాలను గాయకుడు సునీల్ ఆధ్వర్యంలో పలువురు గాయనీగాయకులు చిత్ర గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన మారేపల్లి జోషి, జ్ఞానకిషోర్, డేవిడ్‌రాజు, ప్రవాసాంధ్ర గాయని సింధు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకునిగా విశిష్టసేవలను అందించిన సునీల్‌కు అమెరికాకు చెందిన ప్రైవేట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భం పురస్కరించుకుని సంస్థ నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

- స్వరరాగార్చన ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు ఆకట్టుకున్నాయి.



హనుమంతరాయ గ్రంథాలయంలో చిత్రగీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

అపూర్వ సమ్మేళనం



ఉంగుటూరు: నాలుగు దశాబ్దాల నాటి చెలిమి బలిమి ఇన్నేళ్ల తర్వాత కూడా వారి స్నేహబంధాన్ని దృఢంగా నిలిపింది. దాదాపు నలభై వసంతాల తరువాత కలసిన వారంతా ఇప్పుడు తమ చిన్ననాటి మిత్రులను చూసి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి స్మృతులను తలపోసుకున్నారు. యాభై వసంతాలు దాటిన వారంతా ఒక్కసారి చిన్నపిల్లలై పోయారు. నాడు చేసిన చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకుని పడీపడీ నవ్వుకున్నారు. సంతోషాల హరివిల్లు విరియడంతో ఆ ప్రాంగణమంతా వింత వెలుగులు విరజిమ్మింది. మండల కేంద్రమైన ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో 1983-84 వ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మరణించిన గురువులు, తోటి విద్యార్థులు వేమిరెడ్డి సత్యనారాయణ, శోభన్‌బాబు, రాజేంద్రప్రసాద్, క్రీస్తురాజు, కుక్కమళ్ల ఏసుదాసులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం నాడు తమకు చదువు చెప్పిన గురువులు తెలుగు పండితులు సూర్యదేవర రఘుపతిరావు, హిందీ పండితులు ముళ్లపూడి దత్తాత్రేయ వరప్రసాద్‌ను పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఉద్యోగోన్నతిపై వెళుతున్న ఎంపీడీవోకు సన్మానం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఎంపీడీఓగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వీపీ విజయకుమార్‌ను సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మదుపల్లి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం విజయకుమార్‌ను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో టైపిస్ట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి ఎంపీడీఓగా ఎదగడం విజయకుమార్ కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఉద్యోగ జీవితంలో ఆయన మరింతగా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. వాకర్స్ ప్రముఖులు కేఎస్. బాబూరావు, టీఎస్ఆర్‌కే ప్రసాద్, వీసం శ్రీనివాసరావు, ముక్కామల సుబ్బారావు, గంపా సాంబశివరావు, మున్వర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



విజయకుమార్‌ను సత్కరిస్తున్న వాకర్స్

సామాజిక వికాసానికి వాసవి సేవలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి వాసవి సంస్థలు అందిస్తున్న సేవలు అమోఘమని వాసవీ క్లబ్స్ ఇంటరేషనల్ అంతర్జాతీయ మాజీ కార్యదర్శి పాత సుదర్శన్ అన్నారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం, ఇటీవల జాతీయ స్థాయిలో బహుమతులు పొందిన సభ్యుల అభినందన కార్యక్రమం ఆదివారం కేబీఎస్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాత సుదర్శన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వాసవీ క్లబ్స్ వివిధ రూపాల్లో సామాజిక వికాసానికి పాటుపడుతున్నాయన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు వివిధ రకాల సేవలందిస్తున్నాయన్నారు. వాసవీ సంస్థల నిర్వాహకులు మరింత ఐక్యంగా, విస్తృత కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలోకి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన వాసవీ క్లబ్ సభ్యుల క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు సాధించిన సభ్యులను అభినందించారు. షటిల్, చెస్ పోటీల్లో ప్రథమ బహుమతులు పొందారని జిల్లా గవర్నర్ మిత్తింటి శారద వివరించారు. జిల్లా పరిధిలోని వివిధ క్లబ్‌ల కార్యవర్గాలు వారివారి పరిధుల్లో నిర్వహించిన కార్యక్రమాల నివేదికలను అందించారు. కార్యక్రమంలో క్లబ్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు నందిపాటి శ్రీనివాసరావు, అంతర్జాతీయ సంయుక్త కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, క్లబ్ ప్రముఖులు గద్దం పవన్‌కుమార్, ఇమ్మిడిశెట్టి సురేష్‌బాబు, అనంతుల ఇందిర, కేఎల్వీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో బహుమతులు సాధించిన సభ్యులను అభినందిస్తున్న అతిథులు

ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉచిత న్యాయ సేవలందిస్తామని జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని (జువెనైల్ హోమ్) కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కేవీ రామకృష్ణయ్య ఆదివారం సందర్శించారు. హోమ్‌లోని రికార్డులు పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. హోమ్‌లో సౌకర్యాలు, వారి సమస్యలు, వారికి కల్పించే న్యాయ సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించారు. అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సేవలను అందిస్తామని చెప్పారు. తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడటం సరి కాదని, ఆలోచించి అడుగు ముందుకు వేయాలని బాలురకు సూచించారు. హోమ్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత నేరాలు, గొడవలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలుగుతూ సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందాలని హితవు పలికారు. కార్యక్రమంలో జువెనైల్ హోమ్ పర్యవేక్షణాధికారి రామమోహన్‌రెడ్డి, ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి రామకృష్ణయ్య

రౌడీషీటర్‌పై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో ఇరువర్గాల మధ్య విలువైన ఆస్తి తగాదాలు జరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిని బెదిరించిన రౌడీషీటర్‌పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... కానూరులో ఓ ట్రస్టుకు సంబంధించి భూమిపై ఇరు వర్గాల మధ్య వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన అరవపల్లి రవికుమార్‌ను రౌడీషీటర్ కొక్కిలిగడ్డ జాన్‌బాబు బెదిరించాడని పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఒప్పంద కార్మికురాలి మృతి



మృతురాలు నాగమణి (ఫైల్)

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటనపై ఆదివారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం...మండలంలోని బుద్ధవరం గ్రామానికి చెందిన దుంపల నాగమణి(35), ఆమె భర్త వెంకటేశ్వరరావు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన డ్యూటీకి వెళ్లేందుకు ఇంటి నుంచి బైక్‌పై ఇద్దరూ బయలుదేరారు. అజ్జంపూడి వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన వ్యాన్ బైక్‌కు తగిలి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగమణి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

సంతకం ఫోర్జరీ చేశారని ఫిర్యాదు

పెనమలూరు: సంతకంతో ఫోర్జరీ చేసి తన భర్తతో పాటు పలువురు వ్యక్తులు సొమ్ము స్వాహా చేశారని ఫిర్యాదు అందటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి రామాపురం కాలనీకి చెందిన హసీరాణి ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. ఆమె భర్త టి.ప్రసాద్ ఛత్తీస్‌గడ్‌లో పని చేస్తాడు. భర్త భార్య మధ్య కుటుంబ తగాదాలు ఉన్నాయి. కాగా తన భర్త తన సంతకం పోర్జరీ చేసి ఎల్ఐసీ హౌసింగ్‌లోన్ రుణం 2011 సంవత్సరం నుంచి పలు దఫాలుగా రూ.52.700 లక్షలు తీసుకున్నాడు. ఇందులో రూ.26.40 లక్షలతో ఇల్లు కొన్నాడని, మిగతా సొమ్ము రూ.26.30 లక్షలు ఇంటికి గాని, కుటుంబానికి కాని ఖర్చు చేయలేదని తెలిపింది. తన భర్త దుర్బుద్ధితో ఫోర్జరీ చేసిన మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త చేసిన మోసంలో ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, ఏజెంట్ విజయ్, సాక్షిగా ఉన్న హఫీజ్, ఫీల్డ్ ఆఫీసర్ పాత్ర ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పవన్‌తో రాష్ట్రానికి ఒరిగేది సున్నా



షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అభిమానించే జనసైనికులను సైతం నమ్మలేని పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు ఏమి మేలు చేస్తాడని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ ప్రశ్నించారు. ఆయనతో రాష్ట్ర ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. వారాహి యాత్ర పేరుతో పర్యటిస్తున్న పవన్‌కల్యాణ్ తనపై తనకు కూడా నమ్మకం లేకుండా ఏదేదో మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి అద్దం పడుతుందన్నారు. పవన్ కల్యాణ్‌కు చంద్రబాబును తప్పా మరెవరిని నమ్మటానికి సిద్ధంగా లేడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కోసం పరితపించే పవన్‌కల్యాణ్ తన అభిమానులను టీడీపీకి తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబును ప్రశ్నించటం చేతకాని పవన్‌కల్యాణ్ నేడు మళ్లీ ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నాడు అమరావతిలో పర్యటించిన పవన్ రైతుల నుంచి టీడీపీ ప్రభుత్వం భూములు లాక్కొందని చంద్రబాబును ప్రశ్నిస్తానని చెప్పి వెళ్లి ఇప్పటి వరకూ ఆ ప్రాంతానికి వెళ్లలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా తాను మేలు చేశానని భావిస్తేనే తనకు ఓటు వేయాలని ప్రజలను అడుగుతున్నారన్నారు. దేశంలో అటువంటి దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు మరొకరు లేరన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రజలకు అడ్డగోలు వాగ్దానాలు చేస్తూ ప్రజలను ఏమారుస్తున్నారని విమర్శించారు.

మురళీ మోహన గాంధీకి ప్రముఖుల నివాళి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు గ్రామ ప్రముఖుడు, వేగిరెడ్డి పిక్చర్ ప్యాలెస్ అధినేత వేగిరెడ్డి మురళీ మోహన గాంధీ (72) భౌతికకాయానికి ఆదివారం పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన ఆయన భౌతికకాయాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ గంటా పద్మశ్రీ, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు గంటా ప్రసాదరావు సందర్శించారు. మురళీ మోహన గాంధీ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహా కుంభాభిషేకం పూజలు ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం తూర్పు బజారు శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమోక్తంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య స్థాపన, వాస్తు హోమం అకల్మష హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. రొంపిచర్ల జనార్ధన భట్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్త శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు వేదాంతం బాలాజీ, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఆర్ఆర్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కళాశాలలో హెల్ప్ డెస్క్‌ను సైతం ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రభుత్వ ఖాజీల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రభుత్వ ఖాజీల కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ఖాజీల అసోసియేషన్ల జాయింట్ యాక్షన్ కమిటీ తీర్మానించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఏపీ స్టేట్ ప్రభుత్వ ఖాజీల అసోసియేషన్, రాయలసీమ ఖాజీల వెల్ఫేర్ అసోసియేషన్, ఏపీ ఖుజాత్ కౌన్సిల్, ఏపీ స్టేట్ ప్రభుత్వ ఖాజీల కౌన్సిల్, ఏపీ స్టేట్ ఆర్‌టీ ఖాజీల అసోసియేషన్ ముఖ్య ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్లు అన్నింటినీ కలిపి ఒక జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. జేఏసీ కన్వీనర్‌గా ఖాజీ డాక్టర్ ముఫ్తీ ఖలీల్ అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖాజీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఖాజీ అసోసియేషన్ జేఏసీ నాయకులు ఖాజీ ముఫ్తీ ఖలీల్ అహ్మద్, ఖాజీ మౌలానా ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షకుల ఆందోళన



భవానీపురం(విజయవాడపశ్చిమ): జంతు వధ నిబంధనలకు విరుద్ధంగా రెండు, మూడు నెలల లేగ దూడలతోపాటు పాలిచ్చే గేదెలను సైతం వధించేందుకు కబేళాకు తీసుకురావడం దుర్మార్గమని గో పరివార్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట సురేష్‌బాబు, బ్లూక్రాస్ ప్రతినిధి సురేష్ జాగు, విజయవాడ యానిమల్ యాక్టివిస్ట్ పసుమర్తి ఈశ్వరి, యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ ప్రతినిధి గోపాల్‌రావు సూరాబత్తుల, వీహెచ్‌పీ ప్రతినిధులు ఆందోళనకు దిగారు. మరో వైపు కబేళాకు చెందిన సిబ్బంది, వ్యాపారులు వారితో గొడవకు దిగారు. రెండు వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో ఆదివారం అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వచ్చి వారిని స్టేషన్‌కు తరలించటంతో గొడవ సద్దుమణిగింది. అక్కడ వెస్ట్ ఏసీపీ డాక్టర్ కె హనుమంతరావు ఇరువర్గాలను కూర్చోబెట్టి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధి రాధా మనోహర్ దాస్‌కు ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవి చంద్ మాట్లాడుతూ వ్యాపారులు లారీలో తీసుకువచ్చిన మందతోపాటు లేగ దూడలుకూడా ఉన్నాయని, వాటిని పంపించి వేస్తామని తెలిపారు.

మహిళ మృతి కేసులో భర్త, అత్తలపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): శాంతినగర్లో ఆదివారం జరిగిన దండా శిరీష(26) మృతి చెందిన ఘటనలో భర్త నాగేశ్వరావు, అత్త కుమారిపై నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు శాంతినగర్‌కు చెందిన దండా నాగేశ్వరావుకు రాచావారి పల్లె(నెల్లూరుజిల్లా)కు చెందిన శిరీషకు 2017లో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం, ఆటో డ్రైవర్ నాగేశ్వరావు తరచూ మద్యం సేవించి భార్యతో గొడవపడి, వేధించేవాడు. అత్త కుమారి కూడా వేధింపులకు పాల్పడుతుండేది. ఇంట్లో బంగారం కూడా తాకట్టు పెట్టి మద్యం సేవిస్తుండటంతో భార్య అడిగినందుకు భర్త కొట్టేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఫిర్యాది పెండ్లి నాగేశ్వరి కి దండా నాగేశ్వరావు ఫోను చేసి మీ చెల్లికి సీరియస్‌గా ఉందని చెప్పాడు. అక్కడికి వెళ్లి చూడా శిరీషా మృతి చెంది ఆటోలో ఉంది. నాగేశ్వరి ఫిర్యాదుపై పోలీసులు నాగేశ్వరావు, అతని తల్లి కుమారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.